03012025-DIS-04_Layout 1 1/3/2025 2:47 AM Page 1





మహిళా విద్యను నిర్లక్ష్యం చేసే సమాజం తన సగం శక్తిని జారవిడుచుకున్నట్టే.

- సావిత్రీబాయి పూలే



# వీసాకు భరోసా

**గత** కొన్ని రోజులుగా అమెరికా రాజకీయ చర్చ హెచ్1-బీ వీసాల చుట్టే తిరుగుతుండటం మనం చూస్తున్నాం. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' (క్లుప్తంగా 'మాగా' లేదా అమెరికాకు పూర్వవైభవం సాధిద్దాం) అనే నినాదంతో ట్రంప్ ఎన్నికల బరిలో దిగి ఘన విజయం సాధించారు. జనవరి 20వ తేదీన ఆయన అమెరికా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించబోతున్నారు. ఆ రోజు దగ్గర పడుతున్న కొద్దీ హెచ్1-బీ ఆశావహుల్లో ఆందోళన పెరుగుతున్నది. అమెరికన్లకు వీసాల వల్ల 'అన్యాయం' జరుగుతున్నదనీ, అవి 'చాలా చెడ్డవని' గతంలో ఆయన చేసిన ప్రకటనలే అందుకు కారణం. అయితే, ట్రంప్ విజయంలో కీలక పాత్ర పోషించిన పారిశ్రామిక దిగ్గజం ఎలాన్ మస్క్ చేస్తున్న ప్రకటనలు కొంత గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. నిజానికి ట్రంప్ కంటే ముందే వీసాలకు అనుకూలంగా ఎలాన్ మస్క్ మాట్లాడటం గమనార్హం. ఆయన తీరులోనే ట్రంప్ కూడా ఇప్పుడు అమెరికాకు నిపుణులైన ఉద్యోగుల అవసరం ఉన్నదని, వీసాలు ఉండాల్సిందేనని అంటున్నారు. పైగా తాను ఎప్పుడూ వీసాలకు వ్యతిరేకంగా మాట్లాడలేదని సమర్థించుకున్నారు. ఈ యూటర్న్ ట్రంప్ సంప్రదాయిక మద్దతుదారులకు సహజంగానే ఆగ్రహం తెప్పిస్తున్నది. వీసాలను సమర్థిస్తే 'అమెరికాకే ప్రథమ ప్రాధాన్యం' అనే నినాదాన్ని అటకెక్కించినట్టు అవుతుందనే వాదన వినిపిస్తున్నది.

ఆచరణాత్మకంగా చూస్తే హెచ్1-బీ వీసాలు లేకపోతే ఐటీ కంపెనీల మనుగడ కష్టమవుతుంది. స్థానిక అమెరికన్లలో నైపుణ్యాలు కొరవడటమే ఇందుకు కారణం. భారత్ వంటి విదేశాల నుంచి నిపుణులను ఆకర్షించే ఉద్దేశంతోనే 1990లో సీనియర్ బుష్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు హెచ్1-బీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. పరిశోధన, ఇంజినీరింగ్, సాఫ్ట్‌వేర్ రంగాల్లో ఖాళీల భర్తీకి ఈ వీసాలను ఉద్దేశించడం తెలిసిందే. వీసాల్లో 70 శాతం భారతీయులు, 12-13 శాతం చైనీయులు దక్కించుకుంటారు. మిగిలినవి మెక్సికో, ఫిలిప్పీన్స్, తైవాన్, కొరియా వంటి దేశాల నుంచి భర్తీ అవుతాయి. భారత్ సహా అనేక వర్ధమాన దేశాలకు చెందిన విద్యార్థులు వీసా లభిస్తే భవితకు భరోసా అని నమ్ముతారు. అమెరికా పౌరసత్వానికి తొలిమెట్టులా ఉపయోగపడుతుందనీ భావిస్తారు.

ఏటా 65 వేల వీసాలను అమెరికా జారీ చేస్తుంది. అదనంగా మరో 20 వేల వీసాలు అధిక విద్యార్హతలు, నైపుణ్యాలున్న వారికి కేటాయిస్తారు. అయితే వీసాల సంఖ్య కన్నా అభ్యర్థుల సంఖ్య అధికంగా ఉండటంతో లాటరీ పద్ధతి ప్రవేశపెట్టారు. దీనివల్ల రెండు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఒకటి, నైపుణ్యం కన్నా అదృష్టమే నిర్ణాయకం కావడం. దీనివల్ల అద్వితీయ నైపుణ్యం ఉన్నప్పటికీ అవకాశం లభించకపోవచ్చు. రెండు, హెచ్1-బీ వీసాలతో వెళ్లేవారికి స్థానికుల కన్నా తక్కువ వేతనాలు లభిస్తాయి. 'చీప్ లేబర్' అనే ముద్ర పడింది అందుకే. కానీ, భారత్ వంటి వర్ధమాన దేశాలవారికి డాలరు అధిక విలువ కారణంగా అవే పెద్ద వేతనాలుగా కనిపిస్తాయి. వీసాలు అమెరికన్ యువతకు ఉద్యోగాలు దక్కకుండా చేస్తున్నాయని, విదేశీయులకే పెద్దపీట వేస్తున్నారనే విమర్శలు మాత్రం మొదటినుంచీ ఉన్నాయి. ముఖ్యంగా భారత్ నుంచి వచ్చే యువతీ యువకులు ఉద్యోగాలు ఎగరేసుకుపోతున్నారనే అక్కసు కూడా స్థానికుల్లో అంతకంతకూ పెరుగుతున్నది. హెచ్1-బీ వలసలకు అడ్డుకట్ట వేయాలని వాదించే రిపబ్లికన్ పార్టీ నేతల్లో భారత సంతతి అమెరికన్లు కూడా పెద్ద సంఖ్యలో ఉండటం విడ్డూరం.

మరోవైపు ఈ ఉద్యోగాల్లో నియమించడానికి అమెరికాలో తగినంత మంది నిపుణులున్నారనీ, మరింతగా వలసలను అనుమతించాల్సిన అవసరం లేదని 60 శాతం అమెరికన్లు భావిస్తున్నట్టు ఓ సర్వేలో వెల్లడైంది. ఈ తరహా అభిప్రాయాలు విదేశీయుల పట్ల వ్యతిరేకతకు దారితీయడం జరుగుతున్నది. ఈ వ్యతిరేకతను సొమ్ము చేసుకొని ట్రంప్ విజయం సాధించారనేది తెలిసిందే. గెలిచిన తర్వాత జనాకర్షక విధానాలకు, ఆచరణీయతకు మధ్య సమతూకం పాటించే పనిలో ఆయన పడ్డారని అర్థమవుతూనే ఉన్నది. ప్రస్తుత పరిణామాలు గమనిస్తుంటే వీసాలు రద్దు కావడం దాదాపు అసాధ్యమనే అర్థమవుతుంది. ఒకవేళ సంస్కరణలంటూ జరిగితే వేతనాలు పెరిగి వీసా అభ్యర్థులకు మేలే జరుగుతుందని ఆశించవచ్చు.

# బీసీలకు కుల గణనతోనే న్యాయం



**భారతదేశ సామాజిక ముఖచిత్రం కులం పునాదిగా ఏర్పడింది. ఈ నేపథ్యంలో అన్ని కులాలకు, తరగతులకు సమాజంలోని వివిధ వర్గాల మధ్య తీవ్ర అసమానతలను తగ్గించి, బలహీన వర్గాల సామాజిక, ఆర్థిక జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వాలను భారత రాజ్యాంగం నిర్దేశిస్తున్నది.**

**ఇందులో భాగంగానే ప్రాతినిధ్యం లేని, లేదా తక్కువగా ఉన్న వివిధ కులాలకు, తరగతులకు అవకాశాలు కల్పించేందుకు అనేక మార్పులను, చర్యలను ప్రభుత్వాలు తీసుకుంటూ వస్తున్నాయి. అనేక రకాలైన అభివృద్ధి, సంక్షేమ కార్యాచరణతో పాటు రిజర్వేషన్లను కూడా రాజ్యాంగం రచించిన పెద్దలు ఒక ఆసరాగా అణగారిన వర్గాల కోసం అందించారు.**

**కల్వకుంట్ల కవిత**

స్వాతంత్ర్యానంతర భారతదేశంలో విద్య, ఉద్యోగాల్లో కొన్ని కులాలు తీవ్ర వెనుకబాటుకు గురవుతుండగా వారిని గుర్తించి, మిగతా వారితో సమానంగా అవకాశాలు కల్పించే ప్రయత్నమే రిజర్వేషన్ల ఏర్పాటు. దీనికి నేపథ్యం స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే ఉన్నది. అప్పట్లోనే బ్రిటిష్ వారి కాలంలో 1881-1931 మధ్య జరిగిన 5 జనాభా లెక్కల్లో ఈ వెనుకబాటును గుర్తించి రిజర్వేషన్లు కల్పించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఈ వర్గాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ స్థితిగతులను అధ్యయనం చేసిన రాజ్యాంగ ముసాయిదా కమిటీ అదే పద్ధతిని కాలానుగుణమైన మార్పులతో కొనసాగించాలని భావించింది.

**రాజ్యాంగంలోని అధికరణం 38 ప్రకారం ప్రభుత్వాలు సామాజిక క్రమాన్ని కాపాడటం ద్వారా ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలి. సామాజిక న్యాయం, ఆర్థిక, రాజకీయ న్యాయాలు సాధించాలి. అది ప్రభుత్వాల బాధ్యత.**

రాజ్యాంగంలో అత్యంత వెనుకబడిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు చేర్చబడినాయి. అయితే అప్పటికీ ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించబడలేదు. చంపకం దొరై రాజన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తమిళనాడులో బీసీ రిజర్వేషన్లు చెల్లవని తీర్పు ఇచ్చింది. దీనికి వ్యతిరేకంగా తమిళనాడు అంతటా నిరసనలు పెల్లుబుకాయి. పెరియార్ రామస్వామి నాయకర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తమిళ ప్రజలు ఉద్యమించారు. దీంతో దిగొచ్చిన కేంద్రం 1951లో తొలి రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్టికల్ 15 (4), 16 (4) లను రాజ్యాంగంలో చేర్చింది. ఈ క్రమంలో 1961లో రాష్ట్రాలు తమ సొంత సర్వేలు నిర్వహించి, రాష్ట్ర-నిర్దిష్ట ఓబీసీ జాబితాలను రూపొందించాలని భారత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దానికనుగుణంగా ఉమ్మడి ఏపీలో ప్రయత్నాలు జరిగినా పాలకుల చిత్తశుద్ధి లేక విఫలమయ్యాయి. చివరగా అనంత రామన్ కమిషన్ 1970లో సమర్పించిన నివేదిక వల్ల తొలిసారి బీసీలకు రిజర్వేషన్లు దక్కాయి. ఇక కేంద్ర సంస్థల్లో రిజర్వేషన్ల విషయానికి వస్తే మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం సామాజికంగా లేదా విద్యాపరంగా వెనుకబడిన తరగతులను గుర్తించడానికి, కేంద్ర సంస్థల్లో రిజర్వేషన్ల కోసం 1979 జనవరి 1 నాడు మండల్ కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఈ కమిషన్ 1980 డిసెంబర్ 31న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దురదృష్టవశాత్తూ ఈ నివేదిక పదేండ్ల పాటు కాంగ్రెస్ పాలనలో కోల్డ్ స్టోరేజీలో పెట్టబడింది. మళ్లీ 1990లో నేషనల్ ఫ్రంట్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఉండగా ఈ నివేదిక వెలుగుచూసింది. సుప్రీంకోర్టు క్లియరెన్స్ ఇవ్వడంతో 1990 ఆగస్టు 7న అప్పటి ప్రధాని వీపీ సింగ్ పార్లమెంట్‌లో మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామని ప్రకటించారు. బీసీలకు కేంద్రం నియంత్రణలోని విద్యా సంస్థల్లో, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ప్రకటించి అమలుచేశారు. 1993, సెప్టెంబర్ 8 నుంచి కేంద్ర విద్యావకాశాలు, ఉపాధి రంగాల్లో ఓబీసీ రిజర్వేషన్లు అమలవుతున్నాయి.

అయితే ఓబీసీ రిజర్వేషన్ల కోసం కులాలవారీగా, ప్రాంతాలవారీగా ఓబీసీల జనాభా లెక్కలు తప్పనిసరి. కాబట్టి భారత ప్రభుత్వం ఆ తర్వాత తొలిసారిగా వచ్చిన 2001 జనాభా లెక్కల ప్రకారం ఓబీసీలను లెక్కించి ఉండాలి. కానీ, అలా చేయలేదు. దీనివల్ల మొత్తంగా అన్ని రిజర్వేషన్లు కలిపి 50 శాతానికి మించినప్పుడు ఎవరో ఒకరు కోర్టుకు వెళ్తారు. విచారించిన కోర్టు ఓబీసీల కులగణన జరగలేదు కాబట్టి మొత్తంగా 50 శాతానికి దాటకుండా అందులోనే బీసీ రిజర్వేషన్లు సర్దుబాటు చేయాలని చెప్తూ వచ్చాయి. కాబట్టి ఓబీసీలకు తమ రిజర్వేషన్లు తమకు దక్కాలంటే కులగణన అనివార్యమవుతుంది.

2012లో ఉమ్మడి ఏపీ స్థానిక ఎన్నికల్లో నోటిఫికేషన్ రాగా అదే సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. విషయం కోర్టుకు చేరడంతో హైకోర్టు నిమ్మక జయరాజు వర్సెస్ స్టేట్ ఆఫ్ ఏపీ కేసులో రిజర్వేషన్లు 50 శాతం దాటుతున్నాయనే కారణం చేత బీసీ రిజర్వేషన్లను కొట్టివేసింది. ఇదే సందర్భంలో ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన మరో రెండు తీర్పులు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల మనుగడనే ప్రశ్నార్థకం చేశాయి. 2021లో మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించిన వికాస్ కిషన్ రావు గవలి వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో అయినా, 2022లో మధ్యప్రదేశ్ ఎన్నికలకు సంబంధించి సురేష్ మహాజన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మధ్యప్రదేశ్ కేసులో అయినా సుప్రీంకోర్టు స్పష్టంగా ట్రిపుల్ టెస్ట్ ప్రకారం మాత్రమే బీసీ రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాలని తీర్పునిచ్చింది. అంటే... 1.డెడికేటెడ్ బీసీ కమిషన్ రిజర్వేషన్ ప్రక్రియ పర్యవేక్షించేందుకు నియమించాలి. 2.బీసీల జనాభా నమోదు చేయాలి. వారి వెనుకబాటును నిరూపించగలగాలి. 3.మొత్తంగా రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదు.



**రాజకీయ రిజర్వేషన్లు:** ఇక స్థానిక సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్ల విషయానికి వస్తే 1993 వరకు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ఎక్కడా బీసీ రిజర్వేషన్లు లేవు. 73వ, 74వ సవరణల (1993) తర్వాత, రాజ్యాంగం పంచాయతీలు, మున్సిపాలిటీలలో ఓబీసీలకు కూడా తొలిసారిగా రిజర్వేషన్లు కల్పించింది. ఇందుకు రాజ్యాంగంలో ఆర్టికల్ 243 (6) మరియు ఆర్టికల్ 243డీ (6) చేర్చబడ్డాయి. ఈ ఆర్టికల్స్ ప్రకారం షెడ్యూల్డ్ కులాలకు జనాభా దామాషా ప్రకారం, మహిళకు 33.33 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. ఇవి తప్పనిసరిగా ఇవ్వవలసినవి అని సూచించారు. కానీ, ఓబీసీలకు వచ్చేటప్పటికి రిజర్వేషన్లు ఎంత శాతమో చెప్పలేదు. వెనుకబడిన తరగతుల వారు ఆయా రాష్ట్రాలు ఇచ్చిన రిజర్వేషన్లు పొందాలని రాజ్యాంగంలో పొందుపరిచారు. దీనికనుగుణంగా ఉమ్మడి ఏపీలో పంచాయతీ రాజ్ చట్టం (1994) తీసుకువచ్చారు. కొన్ని లోపాలు ఉన్నప్పటికీ ఈ చట్టంతో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 1994 నుంచి లభించడం ప్రారంభమైంది.

**ఈ నేపథ్యంలో 2023 తెలంగాణ ఎన్నికల సమయంలో కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ చేసింది. ఇందులో భాగంగా బీసీలకు ఉపవర్గీకరణతో కూడిన 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి తర్వాత అధికారంలోకి రావడం జరిగింది. ఆ మేరకు కాంగ్రెస్ చర్యలు తీసుకోవలసి ఉన్నది. బీసీ రిజర్వేషన్ల కోసం ఇదివరకే కోర్టులు సూచించిన మేరకు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వల్ల చాలా జాప్యం జరిగింది. దాదాపు 12 నెలల కాలం వృథా కావడం జరిగింది.**

ఎట్టకేలకు ఏర్పర్చిన డెడికేటెడ్ కమిషన్ నిర్వహిస్తున్న సర్వేలో అనేక అంశాలు సరిచేసుకోవలసి ఉన్నది. ఇంకా ఎన్యుమరేటర్లు చాలా ఇండ్లకు రానట్టు తెలుస్తున్నది. అలాగే సమయాభావం ఉన్నందున ఎన్యుమరేషన్ నెమ్మదిగా జరగడం సరికాదు. కొన్నిచోట్ల కులగణన పత్రాలు రోడ్ల పక్కన కనిపిస్తుండటం ఆందోళనకరం. ప్రస్తుత బీసీల స్థితిగతుల నేపథ్యంలో వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ ముందడుగుకు ఈ కింది చర్యలు తీసుకోవలసి ఉన్నది.

రాష్ట్ర ప్రభుత్వం కుల, జనగణనను పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించాలి. కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీ ఇచ్చినట్టుగా బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేశాకనే ఎన్నికలు నిర్వహించాలి. బీసీల వెనుకబాటుకు, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇచ్చేందుకు రిజర్వేషన్ల మొత్తం పరిమితిని 50 శాతం దాటి పెంచేందుకు అవసరమైన రాజ్యాంగ సవరణ చేయాలి. బీసీ విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ ఎప్పటికప్పుడు విడుదల చేయాలి. సంక్షేమ హాస్టళ్లలో విద్య, వసతి, భోజనం మెరుగుపర్చాలి. శాసనసభలో మహాత్మా జ్యోతీబా పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి.

**వివిధ సభల్లో బీసీల ప్రస్తుత ప్రాతినిధ్యం:** స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు దాటుతున్నా నేటికీ బీసీల ప్రాతినిధ్యం ఎందులోనూ వారి జనాభా ప్రకారం లేవు. లోకసభలో ఓబీసీ ఎంపీలు (2024 ఎన్నిక తర్వాత) ప్రస్తుతం 138 (25.4 శాతం) మంది ఉన్నారు. గత ఎన్నికల్లో కానీ, అంతకు ముందు ఎన్నికల్లో కానీ ఎప్పుడూ వీరు ఇంతకన్నా తక్కువే ఉన్నారు. 2009లో 18 శాతం ఉండగా, 2014లో 20 శాతం, 2019లో 22.8 శాతం ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో 21 శాతం మంది మాత్రమే ఓబీసీ వర్గానికి చెందినవారు. దేశంలోని ఏ ఎన్నిక తీసుకున్నా బీసీల ప్రాతినిధ్యం 20 నుంచి 25 శాతం లోపే. సమాజంలో 52 శాతం ఉన్న బీసీలు ఉమ్మడి ఏపీలో 294 మంది ఎమ్మెల్యేల్లో వీరి సంఖ్య ఏ రోజూ 40 మందిని దాటలేదు. 90 మంది ఉన్న కౌన్సిల్ సభ్యుల్లో 20 మందిని చేరలేదు. ఇక తెలంగాణలో 119 మంది ఎమ్మెల్యేలలో కేవలం 22 మంది (18.5 శాతం) మాత్రమే బీసీలు. ఈ పరిస్థితే ఇలా ఉంటే స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం నామమాత్రంగానే ఉన్నది. అలాగే ఇటు నిధుల పరంగానూ బీసీలు ప్రస్తుతం కేంద్రంలో తమకు రావాల్సిన వాటిలో కనీసం సగం వనరులు, అవకాశాలు కూడా పొందలేక పోతున్నారు. ఈ పరిస్థితుల్లో బీసీల సంక్షేమం కోసం కేంద్రంలో ఒక్క మంత్రిత్వ శాఖ లేకపోవడం విచారకరం. బీసీలకు శాఖ ఉంటే బడ్జెటరీ కేటాయింపుల్లో ప్రాధాన్యం దక్కేది. 48 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో ఓబీసీల సంక్షేమానికి 2 వేల కోట్లు మాత్రమే కేటాయిస్తే ఓబీసీ సంక్షేమం, అభివృద్ధి ఎలా జరుగుతుంది?

**సమగ్రమైన కులాల వారీ డేటా లేకుండా విద్య, ఉద్యోగాల్లో, రాజకీయ రంగాల్లో వెనుకబాటును గుర్తించలేం. ఈ పరిస్థితి వల్ల రిజర్వేషన్లకు ప్రతిబంధకాలు ఏర్పడుతాయి. అలాగే బలహీన వర్గాల కోసం రాజ్యాంగబద్ధంగా నిర్దేశించబడిన సామాజిక న్యాయ విధానాలు సమర్థవంతంగా అమలు కావు. బీసీలకు సంబంధించినంత వరకు రాజ్యాంగం కులాలకు బదులుగా తరగతి అనే పదాన్ని ఉపయోగించినప్పటికీ, సుప్రీం కోర్టు ఇప్పటివరకు ఇచ్చిన వివిధ తీర్పులు వెనుకబడిన తరగతులను నిర్వచించడానికి కులాన్ని ప్రధాన ఆధారంగా పరిగణించాయి.**

తెలంగాణ జాగృతి విద్య, ఆర్థిక, రాజకీయంగా వెనుకబడిన వర్గాల, కులాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న సామాజిక సంస్థ. అసెంబ్లీలో బడుగుల సూర్యుడు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో అనేక కార్యక్రమాలు, ఉద్యమ రూపాలు తీసుకొని విగ్రహాన్ని సాధించిన సంస్థ. తర్వాత మహిళా బిల్లు కోసం సైతం ఢిల్లీ వేదికగా అఖిల పక్షాల మద్దతు కూడగట్టడమే కాకుండా జంతర్ మంతర్‌వద్ద భారీ ధర్నా నిర్వహించింది.

రాజకీయ రంగంలో నేటికీ నామమాత్ర ప్రాతినిధ్యానికే పరిమితమవుతున్న బీసీల కోసం హైదరాబాద్ సహా 5 చోట్ల రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించి మద్దతు కూడగట్టింది. ఈ సందర్భంగా వివిధ కులసంఘాలు, బీసీ మేధావులు లేవనెత్తిన అనుమానాలు హేతుబద్ధమైనవి. వీటన్నింటినీ నివృత్తి చేసి, సమర్థవంతంగా కులగణన చేయవలసిన అవసరం ఉన్నది. బీసీలకు స్థానిక సంస్థల్లో న్యాయమైన వాటా దక్కేదాకా సమష్టిగా రాజకీయ పార్టీల సంస్థల కృషి అవసరం.

ఇప్పటికే 2011లో జతీయ జనాభా లెక్కల్లో భాగంగా సేకరించిన కులాల వారీ వివరాలు చెల్లుబాటు కానందున ఎక్కువ జాగ్రత్త అవసరమని మేము భావిస్తున్నాం. ఇటీవల బీహార్‌లో చేసిన కులగణన కూడా సాంకేతిక సమస్యలతో తాత్కాలికంగా అమలు కాలేదు. కాబట్టి మున్ముందు చట్టసభల్లో, న్యాయస్థానాల్లో నిలబడేలా సాధికారిక సమగ్ర కులగణన జరపాలి.

**(వ్యాసకర్త: ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు)**

**కుల, జనగణన అవసరం:** భారతదేశంలో ఇప్పుడు లభిస్తున్న రిజర్వేషన్లకు స్వాతంత్ర్యానికి పూర్వం 1931లో బ్రిటిష్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన మాత్రమే ఆధారం. ఆ తర్వాత ఇప్పటివరకూ కేంద్రం మళ్లీ ఆ పనికి పూనుకోలేదు. 2018లో అప్పటి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తాము 2019లో మళ్లీ అధికారంలోకి వస్తే దేశవ్యాప్త కుల గణన చేస్తామని హామీ ఇచ్చారు. తర్వాత వారు అధికారంలోకి వచ్చినా మళ్లీ ఆ మాటే ఎత్తలేదు. బ్రిటిష్ పాలనలో 1881 నుంచి 1931 మధ్య జరిగిన 5 జనాభా లెక్కల్లో అన్ని కులాలను లెక్కించారు.

1951లో నిర్వహించిన మొదటి జనాభా గణనలో, కులాన్ని లెక్కించరాదని జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని భారత ప్రభుత్వం ఆదేశించింది. అయితే, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు రాజ్యాంగంలో చేర్చారు కాబట్టి ఎస్సీ, ఎస్టీలను లెక్కించేందుకు మినహాయింపు ఇచ్చారు. 1951 నుంచి ప్రతి జనగణనలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీలు) వారిని లెక్కించారు. అయితే అప్పటికే ఎస్సీ, ఎస్టీల అంత ఎక్కువ వెనుకబాటు కాకపోయినా మిగతా కులాల కన్నా వెనుకబాటుకు గురవుతున్న ఓబీసీల సమస్యలు తెరమీదికి వచ్చాయి.



# చిటికెలో సీన్ మారిపోయిందే?

సంధ్య థియేటర్ తొక్కిసలాట వ్యవహారం, పోలీసుల పని తీరు రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ప్రాధాన్యాలకు అద్దం పడుతున్నాయి. అల్లు అర్జున్ వివాదం తర్వాత తెలుగు సినిమా రంగం హేమాహేమీలంతా వెళ్లి ముఖ్యమంత్రిని కలవడంతో పెను తుఫాన్ కాస్త టీ కప్పులో తుఫాన్‌లా ముగిసిపోయింది. అప్పటివరకు సీఎం రేవంత్‌ను గుర్తించని సినీ పెద్దలు మూకుమ్మడిగా వెళ్లి ఆయనకు బొకేలు ఇచ్చి, శాలువాలతో సత్కరించారు.

**దీంతో ఈ వ్యవహారంలో విజయం ఎవరిదనే చర్చ ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్నది. సినిమా వాళ్లను బెదిరించి సీఎం తన వద్దకు రప్పించుకున్నారు కాబట్టి, ఆయనదే విజయం అని ఒక వాదన. ఒక్కరు చేసిన తప్పునకు సినిమా వారంతా సీఎం వద్దకు వెళ్లి తల దించుకోవలసి వచ్చిందని తమ్మారెడ్డి భరద్వాజ విమర్శించారు. అంటే ఆయన మాట ప్రకారం చూసినా సినిమా వారి మీద సీఎందే విజయం అన్న విషయం స్పష్టమవుతున్నది.**

విజయం సీఎందా? సినిమా వారిదా? అని చర్చ నడుస్తున్నదంటేనే ప్రభుత్వ పాలన తీరును తెలుపున్నది. అసలు ప్రభుత్వానికి, సినిమా వారికి పోలిక ఏమిటి? రెండు భాషల సినిమా రంగాల మధ్య పోలిక చూస్తారు. రెండు రాష్ట్రాల మధ్య పోటీ ఉంటుంది. లేదా గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం మధ్య పోలిక ఉంటుంది. కానీ, ప్రభుత్వం, సినిమా రంగం మధ్య పోటీలో విజయం ఎవరిదనే చర్చ ఏమిటో? అసలు అర్థం కాని విషయం.

రాష్ట్రంలో ఉండే అనేక రంగాల్లో సినీ రంగం ఒకటి. అత్యంత శక్తివంతమైన ప్రభుత్వాన్ని, కాలక్షేపానికి సంబంధించిన ఒక రంగంతో పోటీలో ఎవరు విజేత అని సమాన స్థాయిలో చూడటమే తప్పు అనుకుంటే, సినిమా వారిపై సీఎందే పైచేయి అని మురిసిపోవడం మరొక వింత. ప్రభుత్వంపై సినిమా వాళ్లు పోరాడుతారనే ఆలోచనే తప్పు. దేశాన్ని నడిపించే బడా పారిశ్రామికవేత్తలు సైతం ప్రభుత్వంతో పోరాడలేరు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటారు తప్ప ప్రభుత్వంతో పోరాడరు. దిల్ రాజు నాయకత్వంలో సినిమా పెద్దలంతా సీఎంను కలిసేంత వరకు అల్లు అర్జున్-సంధ్య థియేటర్ తొక్కిసలాట వ్యవహారాన్ని ప్రభుత్వం మరే సమస్య లేనట్టుగా చిత్రీకరించింది. ఒక పోలీసు కేసుగా చూడకుండా ఆ వ్యవహారాన్ని సీఎం వ్యక్తిగతంగా తీసుకున్నారు. హాస్టళ్లలో ఆహారం వికటించి విద్యార్థులు మరణించినా, సీఎం పర్యటనలో ఆయన కటౌట్‌లతో విద్యుత్తు షాక్‌తో ఇద్దరు వ్యక్తులు మరణించినా స్పందించని సీఎం అల్లు అర్జున్ వ్యవహారంలో 'మానవత్వంతో స్పందించినట్టు' పేర్కొన్నారు. విద్యార్థులు, కటౌట్‌తో కార్యకర్తలు మరణించినప్పుడు మానవత్వం ఏమైంది అనే ప్రశ్నలు సహజం.

**సినీ బృందం ముఖ్యమంత్రిని కలిసేదాకా పోలీసు ఉన్నతాధికారులు, కాంగ్రెస్ నాయకులు అల్లు అర్జున్ తీరుపై ధ్వజమెత్తారు. ఆషామాషీ కేసు కాదు, దేశ బహిష్కరణో, ఉరి శిక్షో తప్పదు అన్నంత హడావుడి చేశారు. ఎప్పుడూ హుందాగా మాట్లాడే పోలీసు అధికారి సీవీ ఆనంద్ సైతం ఈ వ్యవహారంలో సహనం కోల్పోయి జాతీయ మీడియాను దూషించారు. తర్వాత ఆయనే క్షమాపణలు చెప్పారు. అంటే ఈ కేసుపై పోలీసుల పైనా తీవ్రమైన ఒత్తిడి పనిచేసింది అనిపిస్తున్నది.**

ప్రతి రోజు, ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఎన్నో కేసులు నమోదవుతుంటాయి. కానీ, అల్లు కేసులో మాత్రం శాసనసభలో గంటల తరబడి చర్చ, పోలీసు అధికారుల ప్రెస్ కాన్ఫరెన్స్‌లతో రాష్ట్రంలో ఇదొక్కటే ప్రధాన సమస్య అన్నట్టు చేశారు. సినీ పెద్దలు సీఎంను కలువగానే అంతా గప్‌చుప్. రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వం ఏర్పడినప్పుడు సినిమా వాళ్లు వెళ్లి సీఎంకు బొకే ఇవ్వడం ఆనవాయితీ. కానీ, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత సినీ పెద్దలు ఎవరూ వెళ్లి రేవంత్‌కు బొకేలు అందించలేదు. ఇదిలా ఉంటే... 'నేను సీఎం అయ్యాక జగన్ (అప్పుడు సీఎం) ఫోన్ చేసి అభినందించలేదు' అని రేవంత్ బహిరంగంగానే మాట్లాడారు. నంది అవార్డుల స్థానంలో గద్దర్ అవార్డులు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. దీనిపై కూడా సినిమా పెద్దలు స్పందించలేదు. 'గద్దర్ అవార్డులు ఇస్తామంటే సినిమా వాళ్లు ఎవరూ స్పందించలేదు' అని సీఎం రేవంత్ ఏకంగా మీడియా సమావేశంలో విమర్శించారు. ఆ తర్వాత వెంటనే చిరంజీవి స్పందించి గద్దర్ అవార్డును స్వాగతించారు. కానీ, పెద్దగా ముందడుగు అయితే పడలేదు. ఇలాంటి పరిణామాల మధ్య పాలకులకు 'అల్లు అర్జున్-పుష్ప' కేసు చేతికి చిక్కింది. దానితో సీఎం రేవంత్ సినిమా వాళ్లకు చుక్కలు చూపించాలనుకున్నారు. అంతే తప్ప కేసును కేసుగా చూసినట్టు కనిపించలేదు.



**బుద్ధా మురళి**

# సమగ్ర శిక్ష ఉద్యోగులతో వెట్టిచాకిరి!

**కేంద్ర,** రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహించే అనేక పథకాల్లో కాంట్రాక్టు విధానం రాజ్యమేలుతున్నది. ఆశ, అంగన్వాడీ, సమగ్ర శిక్ష, కేజీబీవీ, యూఆర్ఎస్ ఇలా అనేక విభాగాల్లో కాంట్రాక్టు ఉద్యోగులున్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఆరోగ్య, జీవిత బీమా, రిటైర్మెంట్ ప్రయోజనాలు తదితర సౌకర్యాలు వీరికి వర్తించవు. ప్రజా సం క్షేమం కోసం అనేక పథకాలు ప్రారంభిస్తున్న ప్రభుత్వాలు వాటిని అమలుచేసే ఉద్యోగులను గాలికి వదిలేయడం విడ్డూరం. కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ ఆదర్శవంతంగా ఉండాల్సిన ప్రభుత్వాలే దశాబ్దాలుగా వారి శ్రమను దోపిడీ చేస్తున్నాయి.

ఈ పథకం కింద రెండు దశాబ్దాలుగా మన రాష్ట్రంలో సుమారు 19,350 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వీరికి కనీస వేతనాలు, బీమా సౌకర్యం రిటైర్మెంట్ ఫలాలు లేక ఆధునిక బానిసత్వాన్ని, వెట్టిచాకిరి అనుభవిస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని హామీలు ఇచ్చినా అవి అమలు కావడం లేదు. సీఎం స్వయంగా హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా నెరవేరలేదు. దీంతో వారు పలు నిరసనలు చేపట్టి, ఇప్పుడు ఏకంగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చారు.

రెగ్యులరైజ్ చేయాలనే వారి డిమాండ్ న్యాయబద్ధమైనదే. ఎందుకంటే వారు ప్రభుత్వం ద్వారానే జీతాలు పొందుతున్నారు. 21 రోజులుగా సమ్మె చేస్తున్నావారిని ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరం. కాగా, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయవద్దని హైకోర్టు చెప్పిందని కొందరు మాట్లాడుతున్నారు. హైకోర్టు తీర్పు కాంట్రాక్టు జేఎల్ రెగ్యులరైజేషన్ విషయానికే వర్తిస్తుంది. సమగ్ర శిక్ష ఉద్యోగులు రాత పరీక్ష, రోస్టర్ కమ్ మెరిట్ ద్వారా నియామకమయ్యారు. సాంకేతికంగా హైకోర్టు తీర్పు సమగ్ర శిక్ష ఉద్యోగుల సేవల క్రమబద్ధీకరణకు అడ్డు కాకపోవచ్చు. కాబట్టి ప్రభుత్వం వారి డిమాండ్లలోని న్యాయాన్ని గుర్తెరగాలి. పేద, అనాథ, సింగిల్ పేరెంట్ పిల్లలు గత 21 రోజులుగా విద్యకు దూరమై ఉపాధ్యాయుల కోసం ఎదురుచూస్తున్నారు. విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రభుత్వం గొప్పలకు పోతూ, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆవేదనను అర్థం చేసుకోకపోడం శోచనీయం. ఇప్పటికైనా ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి.

**- జుర్రు నారాయణ యాదవ్, 9494019270**

# ప్రజలు ఉచితాలపై ఆధారపడొద్దు



ప్రజలు ఉచితాల కోసం ప్రభుత్వంపై ఆధారపడటం మానుకోవాలి. సౌర విద్యుత్తును సొంతంగానే ఉత్పత్తి చేసుకోవాలి. పునరుత్పాదక రహిత ఇంధన వనరులతో కూడిన ఉచిత పథకాలు ప్రభుత్వానికి భారంగా మారుతున్నాయి. ఉచితంగా పంపిణీ చేస్తున్న వాటికి చెల్లించాల్సిన ఖర్చు భారీగా ఉంటున్నది.

– ప్రహ్లాద్ జోషి

**కేంద్ర పునరుత్పాదక విద్యుత్తుశాఖ మంత్రి**